క్లుప్తంగా

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేశ్వర్‌నాయక్

యాచారం: మండల పరిధి కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు రాజేశ్వర్ నాయక్, రామకృష్ణ తదితరులు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, నీటి పొదుపుపై వివరించారు. రైతు నమోదుపై మండల వ్యవసాయ అధికారి రవినాథ్ రైతులకు తెలిపారు. సమావేశంలో ఏఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు యోగా తప్పనిసరి



పిల్లలకు యోగా నేర్పుతున్న మాస్టర్ ముత్యం

ఇబ్రహీంపట్నం: పిల్లలకు విద్యతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు వ్యాయామం, యోగా ఎంతో ముఖ్యమని ఏబీసీడీ డ్యాన్స్ మాస్టర్ ముత్యం అన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులకు ఏబీసీడీ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో యోగా, వ్యాయామం, ఆటపాటల సమ్మర్ క్యాంపును ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం శిక్షణ శిబిరంలో ముత్యం మాట్లాడుతూ.. సెలవుల్లో బాలబాలికలు టీవీ, మొబైల్ ఫోన్లపై దృష్టిపెట్టకుండా, సమ్మర్ క్యాంపును వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీతో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాస పథకం కింద అర్హులైన వారికి వెంటనే రుణాలు అందేలా చూడాలని నేతలు ఎంపీని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో వైద్య చికిత్స చేయించుకున్న ఎల్మినేడు గ్రామానికి చెందిన శ్రీహరికి రూ.60 వేలు, సత్తయ్యకు రూ.60 వేలు, శోభకు రూ.16వేలు, భారతమ్మకు రూ.16 వేలు, కిరణ్‌కు రూ.25,500లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మంఖాల శేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, యాదగిరి, జంగయ్య, గోపాల్, పట్నం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



యాదీలాల్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన యాదీలాల్‌ను మంగళవారం కల్వకుర్తి అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి అసోసియేషన్ సభ్యుడు జమీల్ అహ్మద్, కృష్ణయ్య, మల్లేశ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, ఆంజనేయులు, జంగయ్య, రాంపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, శ్రీకాంత్, రమణ, నాగరాజు, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలి.. గోతులు ఏర్పడి

ఎక్వాయిపల్లి నుంచి చరికొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కంకర తేలి, గోతులు, కయ్యలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. వాహనాలు మొరాయించడం, తరచూ ప్రమాదాలు జరగుతుండటంతో వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

అధ్వానంగా ఎక్వాయిపల్లి రహదారి
- మొరాయిస్తున్న వాహనాలు..
- ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు, ప్రయాణికులు
- తరచూ ప్రమాదాలతో బెంబేలు



ఎక్వాయిపల్లి- ముద్వీన్ రహదారి దుస్థితి

కడ్తాల్: రెండు దశాబ్దాల క్రితం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన రహదారి కర్కల్‌పహాడ్ గేట్ నుంచి కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి, కిష్టారాంపల్లి, ముద్వీన్ మీదుగా చరికొండ వరకు బీటీ రోడ్డును నిర్మించారు. రహదారి మీదుగా నిత్యం కడ్తాల్, ఆమనగల్లు, మాల్, నాగిళ్ల, కొలుకులపల్లి, ముద్వీన్, చరికొండ, యాచారం, చింతపల్లి గ్రామాలకు వాహనాలు పరుగులు తీస్తుంటాయి. ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యేకించి మండల పరిధి ప్రయాణికులు నల్గొండ జిల్లా మాల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు తక్కువ దూరం కావడంతో.. ఈ మార్గాన్ని ఎంచుకుంటారు.

నిధులు లేక..

రహదారి సమస్యను పలువురు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కర్కల్ పహాడ్ నుంచి చరికొండ వరకు 15 కిలో మీటర్ల రోడ్డును మూడు బిట్లుగా విభజించారు. ఆధునీకరణకు 2024లో టెండర్లు ఆహ్వానించారు. అందులో కర్కల్‌పహాడ్- ఎక్వాయిపల్లి మధ్య 5 కిలో మీటర్ల రోడ్డును రూ.91 లక్షలతో ఆధునీకరించారు. రెండు బిట్లుగా విభజించిన ఎక్వాయిపల్లి నుంచి ముద్వీన్, ముద్వీన్ నుంచి చరికొండ వరకు 10 కిలో మీటర్ల రోడ్డుకు రూ.2.05 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు వేశారు. అయినా నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

నరక ప్రయాణం..

అధ్వానంగా ఉన్న ఎక్వాయిపల్లి, కిష్టారాంపల్లి, ముద్వీన్, చరికొండ రహదారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో పయనిస్తున్నారు. ధ్వంసమైన రోడ్డు ఆపై గుంతలు ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది గాయాలతో ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్డును రెండు వరుసలుగా నిర్మించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సాఫీగా సాగని ప్రయాణం



ఎక్వాయిపల్లి- చరికొండ రహదారిపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. పూర్తిగా గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సాఫీగా ముందుకు సాగని పరిస్థితి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజారవాణాను దృష్టిలో ఉంచుకుని ముద్వీన్- చరికొండ రహదారిని విస్తరించాలి.

– గంట నరేశ్, ముద్వీన్

మెరుగు పరుస్తాం



ఎక్వాయిపల్లి- చరికొండ రహదారి అభివృద్ధి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రవాణా మార్గాన్ని మెరుగుపరుస్తాం. వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– పరమేశ్, పీఆర్ఎఈ, కడ్తాల్

కబ్జా భూములపై సర్వే చేస్తాం

- అర్హులైన రైతులకు పరిహారం అందజేస్తాం
- ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా కబ్జాలో ఉన్న అర్హులైన రైతులకు పరిహారం అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి అన్నారు. నక్కర్త మేడిపల్లి, పల్లెచల్కతండా, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో పలువురు రైతులు ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్నప్పటికీ ఫార్మాసిటీ భూసేకరణలో పరిహారం అందలేదు. సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనుల్లో కబ్జాలో ఉన్న రైతులు వివరాలు తెలియగా.. ఆ భూములను ఆర్డీఓ అనంత్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం పరిశీలించారు. బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ రైతులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆందోళన వద్దని, కబ్జాలో ఉన్న భూములపై మళ్లీ సర్వే చేయించి, అర్హులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. వారం క్రితం కలెక్టర్‌తో టీజీఐఐసీ అధికారుల సమావేశం జరగాల్సి ఉండగా వాయిదాపడిందని, రెండు, మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసుకుని, పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనులకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ అయ్యప్ప తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తిచేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



కేశంపేట: బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి బ్యాంకుల అధికారులకు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆయా బ్యాంకుల అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ జిల్లా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 1,673 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికపై బ్యాంక్ అధికారులకు నియమ నిబంధనలను వివరించి, మండలంలో వచ్చిన దరఖాస్తులను వారికి అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ప్రకాశ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల వారీగా దరఖాస్తుల పరిశీలన

కొందుర్గు: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇటీవల ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకర్లు పరిశీలించారు. బ్యాంకుల వారీగా దరఖాస్తులను విభజించి, జాబితాను బ్యాంకర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఉంటుందని, దరఖాస్తుదారుల పూర్తిడేటా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో మండల స్థాయి అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్



రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, అజీజ్‌నగర్ రెవెన్యూలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. చిలుకూరులోని సర్వే నంబర్ 457 ప్రభుత్వ శిఖం భూమిలో అక్రమంగా షెడ్ నిర్మించారు. ఓ ప్రైవేటు ఫాంహౌస్‌కు ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేశారు. అదే విధంగా అజీజ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 49 ప్రభుత్వ భూమిలో రెండు ఇళ్లు నిర్మించగా.. వాటిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీబీఐ కోర్టు తీర్పుపై సంబురాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- హర్షం వ్యక్తంచేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ

కడ్తాల్: ఓబుళాపురం మైనింగ్ అక్రమ తవ్వకాల కేసులో ఎమ్మెల్యే సబితారెడ్డిని నిర్దోషిగా పేర్కొంటూ మంగళవారం సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ.. సంబురాలు చేసుకున్నారు. బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2011లో సబితారెడ్డిపై నాటి ప్రభుత్వం మైనింగ్ కేసులో పాత్ర ఉన్నట్లు అభియోగం మోపిందని ఆరోపించారు. ఎట్టకేలకు ఈ కేసులో ఆమె పాత్ర లేదని, ఎలాంటి ఆధారాలు లేనందున సబితారెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని న్యాయస్థానం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు గోవర్ధన్, మహేశ్, శేఖర్, యాదయ్య, కృష్ణయ్య, నర్సింహ ఉన్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారం గ్రామం శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం నుంచి 29వ కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండోజు బాలకృష్ణచారి, ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ఉమాకాంత్‌చారిలు తెలిపారు. ఉదయం గ్రామదేవతల ఆవాహనం, గణపతిపూజతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం, సాయంత్రం గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు వాసవీమాత జయంతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం వాసవీమాత జయంతిని నిర్వహిస్తున్నామని దేవాలయ కమిటీ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి సందర్భంగా అమ్మవారికి ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, 11 గంటలకు సామూహిక కుంకుమార్చన, డోలారోహనం, లలితా సహస్రనామ పారాయణం, అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

కులగణన దేశానికే ఆదర్శం

మాడ్గుల: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత రాహుల్‌గాంధీ నిర్వహించిన జోడో యాత్రలో కులగణన నిర్ణయం తీసుకున్నారని, ఇందులో భాగంగానే తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి అసెంబ్లీలో తీర్మానం చేయించారని తెలిపారు. ఇదిలా ఉండగా.. బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టిన నేపథ్యంలో.. దేశ వ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. దీంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

అన్నదానం హర్షణీయం



రైతులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు


ఆమనగల్లు: మార్కెట్‌యార్డులో ధాన్యం విక్రయించేందుకు వస్తున్న రైతులకు భోజన వసతి కల్పించడం హర్షదాయకమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతుల సౌకర్యార్థం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత సొంత ఖర్చుతో మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం రైతులకు.. నాయకులు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కడ్తాల్ అధ్యక్షుడు బిచ్యానాయక్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో ఈ నెల 5 నుంచి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఈ నెల 8వ తేదీన లక్ష్మారావుగూడ, సోలిపేట్, 16న తిమ్మారెడ్డిగూడ, మద్దూరు, 23న ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్, 30న మక్తగూడ, పెద్దవేడు, జూన్ 6న రేగడిదోస్వాడ, చందనవెళ్లి, 13న తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్రవేతలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

షాబాద్: వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేయడం అభినందనీయమని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ నిరంతరం కృషి చేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈసీ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో చుట్టూ పక్కన గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మద్దూరు కిష్టయ్య, శ్రీనివాస్, నర్సింలు, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు



యాచారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. సరైన మద్దతు ధర చెల్లిస్తాం.. సకాలంలో డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా.. నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారంటూ ప్రైవేటు వ్యక్తుల వైపే మొగ్గుచూపడం గమనార్హం.

- ధాన్యం సేకరణలో అలసత్వం
- తాలు, తేమ పేరుతో ఇబ్బంది
- అకాల వర్షాలతో బెంబేలు
- నిరీక్షించలేక నీరసిస్తున్న రైతులు
- చేసేది లేక దళారులను ఆశ్రయిస్తున్న వైనం

యాచారం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తమ దిగుబడిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు పొందాలని, అదే సమయంలో సన్నాలకు రూ.500 బోనస్ తీసుకోవాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అందులో భాగంగా ధాన్యం సేకరణ కోసం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లి, యాచారం, ఐకేపీ ఆధ్వర్యంలో నందివనపర్తి, చింతపట్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పక్షం రోజుల క్రితం ప్రారంభించింది. మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300గా నిర్ణయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్వాహకుల నిబంధనల కొర్రీలతో కర్షకులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు.

రైతుల వద్దకే దళారులు

మండలంలోని 24 గ్రామాల రైతులు రబీ (యాసంగి)సీజన్‌లో 4,200 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సుమారు 25 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దిగుబడిలో 40 శాతానికి పైగా విక్రయించనున్నారు. ఇదిలా ఉండగా.. వరి కోతలు పూర్తికావచ్చాయి. దిగుబడులు చేతికి వస్తూనే ఉన్నాయి. కానీ చాలా మంది రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, యాచారం, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మాల్, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి, కోతలు పూర్తి అయిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధరగా రూ.2,300లకు పైగా చెల్లిస్తున్నారు. అదేమని పలువురు రైతులను వివరణ కోరగా.. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అనేక కొర్రీలు పెడుతున్నారని పేర్కొంటున్నారు. తాలు, తేమ పేరుతో సతాయిస్తున్నారని, సకాలంలో కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి ఎలాంటి ఇబ్బంది లేదని, వెంటనే ధాన్యం తీసుకుంటున్నారని, డబ్బులు త్వరగానే వస్తున్నాయని చెప్పడం గమనార్హం.


1,500 క్వింటాళ్ల సేకరణ

మండలంలోని నాలుగు కేంద్రాల్లో నేటికి 1,500 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే సేకరించారు. మంతన్‌గౌరెల్లి కేంద్రానికి 25 మంది రైతులు 1,100 క్వింటాళ్ల ధాన్యం, నందివనపర్తి కేంద్రానికి 5 మంది రైతులు 220 క్వింటాళ్ల ధాన్యం, చింతపట్ల కేంద్రానికి 6 మంది రైతులు 216 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారు. యాచారంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి 5 మంది రైతులు 50 క్వింటాళ్లకు పైగా ధాన్యం తేగా.. నిబంధనల కొర్రీలతో కొనుగోలు చేయడం లేదు. పది రోజులుగా రైతులు ధాన్యం కుప్పలతో కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. వర్షం కురిసి ధాన్యం తడిస్తే బాధ్యులెవరని ఆందోళన చెందుతున్నారు.



వర్షం భయంతో ధాన్యం రాశులపై కవర్లు కప్పిన రైతులు

కోతలు పూర్తి కాలేదు



మండల పరిధి పలు గ్రామాల్లో వరి కోతలు పూర్తి కాలేదు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే తెచ్చి విక్రయించాలని రైతులకు సూచిస్తున్నాం. ఇప్పటి వరకు నాలుగు కేంద్రాలకు 1,500 క్వింటాళ్ల ధాన్యమే వచ్చింది. యాచారం కేంద్రంలో 50 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. మొత్తం సేకరిస్తాం. కోతలు పూర్తయి.. మరింత ధాన్యం వచ్చే అవకాశం ఉంది. దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోవద్దు.

– రవినాథ్, వ్యవసాయ అధికారి, యాచారం